కొడుకు మాట నమ్మలేదు.

అదీ... డాడీ... నేను... నసగ సాగాడు. ఆ కుర్రాడు. చెప్పు! ఏం. జరిగిందో చెప్పకపోతే ఎలా? ఏమిటి, సమస్య? పైప్ నోట్లో పెట్టుకుని. పచార్లు చేస్తూ అడిగాడు మిత్రా.

"మొన్న జంట హత్యలు జరిగాయి చూడు..."

ఒక్కసారి వులిక్కిపడ్డాడు మిత్రా. వాటికీ వీడికి ఏమిటి సంబంధం అన్నట్టు!

వాళ్ళిద్దరూ నాకు ఫ్రెండ్స్. మేం ముగ్గురు జుహూ ఏరియాలో ఎమ్యూజ్‌మెంట్ పార్క్ ప్లాన్ చేశాం. అయితే? అడిగాడు మిత్రా.

ఆ తర్వాత వాటాల విషయంలో తేడా వచ్చి విడిపోయాం.

అది జరిగిన వారం రోజుల తర్వాత శశికాంత్, రమేష్‌లు హత్యకు గురయ్యారు. నాకేదో భయంగా వుంది... ప్లీజ్ డాడీ నన్ను కా... అమ్మా! వాక్యం పూర్తి చేయకుండానే వాడి వీపులో 'వఫ్' మని శబ్దం చేసుకుంటూ దిగిపోయింది బుల్లెట్. కూలిపోతున్న కొడుకును పట్టుకుని చుట్టుపక్కల చూశాడు కమిషనర్. తన ఇంటికి ఎదురుగా వున్న అపార్ట్‌మెంట్ టాప్ నుంచి టెలిస్కోపిక్ గన్‌ని తాపీగా మడిచి ఏదో ఫొటోగ్రాఫర్ ఫొటో తీసేసిన తర్వాత స్టాండు అవీ సద్దుకున్నంత కాజువల్‌గా ఒక వ్యక్తి తుపాకీ సామగ్రి బ్యాగ్‌లో సద్దుకుని వెనుదిరిగాడు. మిత్రా కొడుకును అలాగే వదిలేసి బెడ్‌రూంలో తలగడ కిందుంచిన రివాల్వర్ తీసుకుని పులిలా బయటకు దూకాడు. ఆయన బయటకొచ్చే సరికే శరవేగంగా మారుతీ-1000 వైట్ కార్ దూసుకుపోయింది ముందు నుంచి!

* * *

కొడుకు పూర్తిగా చెప్పినా బావుండు. ఈలోపునే కడతేరిపోయాడు. హంతకుడు సామాన్యుడు కాదు. అత్యంత ఆధునిక ఆయుధాలు గలవాడు. కమిషనర్ ఆలోచనలో పడ్డాడు.

* * *

దాదర్ ప్రాంతంలోని ఓ వ్యభిచార గృహంపై రెయిడ్ జరిగింది ఆరోజు. ఇవన్నీ మామూలే...

అయితే ఆరోజు దొరికిన వారిలో వొక కాల్‌గర్ల్ దగ్గర ఆశ్చర్యకరంగా షేర్ లావాదేవీలు, హవాలా లావాదేవీలకు సంబంధించిన కొన్ని పత్రాలు దొరికాయి. ఇలాంటి వైనం పోలీసులకు బొత్తిగా కొత్త. ఆ విషయం ఆనోట ఈనోట కమిషనర్ వరకూ పోయింది.

పత్రాలు స్వాధీనం చేసుకుని పరిశీలించారు. అంతకుముందు హతులైన రమేష్, శశికాంత్‌ల ట్రాన్సాక్షన్‌తో కూడిన పత్రాలవి. అనుమానంతో కమిషనర్ ఆమెను ప్రత్యేకంగా ఇంటరాగేట్ చేశాడు. తీగ లాగితే డొంకంతా కదిలింది.

* * *

"నేను ఏడేళ్ళుగా ఇక్కడే బిజినెస్ చేస్తున్నాను. నాలాంటి అమ్మాయిలు చాలామంది వున్నాం. రోజువారీ సంపాదన షేర్లలో పెట్టుబడి పెట్టడానికి మేం సిండికేట్ అయ్యాం! శశికాంత్, రమేష్‌ల కన్సల్‌టెన్సీలో సంప్రదించాం. ఆ నాటి నుంచి మేం దాదాపు ఆరుగురం 10 లక్షలు దాచాం. ఏడాది సంపాదన అది. వాళ్ళు మమ్మల్ని మోసం చేశారు. నకిలీ షేర్లు అమ్మారు. అదేం అని అడిగితే దిక్కున్నచోట చెప్పకోమన్నారు. ఈలోగా వాళ్ళలో వాళ్ళకి గొడవలొచ్చాయి. మావాళ్ళు అందరి తరపున నేనే వాళ్ళని అప్రోచ్ అయ్యి బ్రతిమాలాను బామాలాను. కడుపు రగిలిపోయింది. మేం వళ్ళు అమ్ముకుని చచ్చి బతికి సంపాదించిన సొమ్ము అది. మోసం చేశారు. అందుకే వొక్కొక్కడినీ నేనే చంపాను. శశికాంత్‌ని చంపగానే రమేష్‌కి నామీదే అనుమానం వచ్చింది. అందుకే రెండో రోజే వాడినీ చంపాను. నీ కొడుకును మాత్రం కిరాయి హంతకుడితో చంపించాను...

అంటూ మల్లికా సహాని అనబడే ఆ కాల్‌గర్ల్ చెప్పిన కథనం చాలామందిని కదిలించి వేసింది. చట్టానికి ఏమోషన్‌తో పనిలేదు. అది తన పని తాను చేసుకుపోయింది. డబ్బూ పోయి జీవితమూ పోయి నిస్సహాయంగా మల్లిక తీహార్ జైల్‌లోని లేడీ సెల్ లోంచి దీనంగా ఏడుస్తూనే వుంది ఇప్పటికీ!

మినీకథ:

# ఓస్ యింతేనా?



తమ బస్సెక్కిన దగ్గర్నుండి ఆ ఇద్దరి వైనం గమనిస్తున్నాడు ధర్మారావు.

వెనుక సీట్లో కూచున్న వ్యక్తి ముందర ఆడవాళ్ళ సీట్లో కూచున్న ముద్దు గుమ్మను 'యస్' మంటూ పిలవటం, ఏవో సైగలు చేయటం ప్రారంభించాడు.

ఆ అందాల భామ ఆగమని సైగ చేస్తోంది.

ఈ తతంగం ఆ అయిదునిముషాల్లో పదిసార్లు జరిగింది. ఆ మూగ సైగల ధోరణి ఎంత మాత్రం బోధపడలేదు ధర్మారావుకి. అందువల్లనే పరిశీలనలో శ్రద్ధ మరింత శాతం పెంచాడు.

ఈ సారి ఆ అమ్మాయిని మరల చేతులాడించి ప్రశ్నించాడు కుర్రాడు.

రెండు చేతివేళ్ళు చూపించిందా అమ్మాయి.

బహుశా తమ ముందేదిగిపోవాలని అంటే, ఆ అమ్మాయి పది నిముషాలు ఓపిక పట్టలేవాలని బ్రతిమాలుతుందేమో!

ఓ స్టేజీలో బస్సాగినా యిద్దరూ దిగలేదు.

ధర్మారావు ప్రక్కనున్న ముసలి శాస్త్రి—

"అమ్మా! తిలకిస్తున్నారా! వారిద్దరి వ్యవహారమూమా... ఎంచక్కా బస్సులోనే సిగ్నల్స్...కాలం ...కలికాలం" అన్నాడు.

ధర్మారావులో అదే అభిప్రాయం బలపడింది.

మరోసారి ఆ కుర్రాడు సైగచేస్తే నెత్తిమీద కొట్టుకుని 'వుండు బాబూ చంపకు' అన్న ధోరణిలో భావం వ్యక్తపరచింది.

అంటే ఈ కుర్రాడు ఆమెను ఏ సినిమాకో రమ్మని వేధిస్తుంటే, ఆ అమ్మాయి ఇంటికి వెళ్ళిపోతానంటుందేమో!

ఏదీ అర్థంకాక సతమతమైనాడు ధర్మారావు.

ఓ చోట బస్సాగింది.

ఆ అమ్మాయి దిగింది. వెనకాలే ఆకుర్రాడూనూ!

కూపీలాగాలని ధర్మారావూ దిగాడు.

"ఎందుకలా సతాయిస్తారు. ఇమ్మన్నాక మీ కివ్వాల్సినది మీ కివ్వకుండా ఇంటికి పోతాననుకున్నారా! దీని కోసం బస్సులో ఆ సైగలేమిటి! జనం ఏమనుకుంటారు." ఆ కుర్రాడితో వాదిస్తోంది అమ్మాయి.

"అహహ!! అదేంకాదు... మీరిస్తారని నాకు తెలును... కానీ ఆ ఇచ్చేదేదో తొందరగా యిచ్చేస్తే" అని ఆగాడు.

కొత్త ప్రేమ జంట కాబోలు! తన సైగల్లో చిలిపి కోడ్ ఉపయోగించి వేధించి వుంటాడు. అందుకే ఆ అమ్మాయి అసహనం ప్రదర్శిస్తోంది.

వారిద్దరూ కిళ్ళీ బడ్డీ వైపు నడిచారు.

రెండు సోడాలు త్రాగారు.

ఇద్దరూ సయోధ్యకొచ్చారని ధర్మారావు భావించాడు. ఇంకా అసలు విషయం తెలుసుకోవాలని చెక్క పొట్లాం నెపంతో బడ్డీ దగ్గరకు వెళ్ళాడు.

"ఇందండీ మహాప్రభో! మీ ఏడున్నర. ఆ కండక్టర్ మనిద్దరినీ చిల్లర మార్చి పంచుకోమని నోటివ్వటం కాదు గాని నా ప్రాణం తోడారు." అని చిల్లరను కుర్రాడి చేతిలో వుంచింది.

ధర్మారావు "ధర్మసందేహం" తొలగిపోయింది.

—కె.కె.రఘునందన